క్లుప్తంగా

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్సై అనూక్‌తో మాట్లాడుతున్న గొట్టిపాటి భరత్

యద్దనపూడి: వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు గొట్టిపాటి భరత్ పోలీసులను డిమాండ్ చేశారు. శనివారం రాత్రి ఆయన యద్దనపూడి గ్రామంలో పర్యటించి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులకు, ప్రజలను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్టూరు శివారు పరిధిలో మూడు రోజుల క్రితం నాయకులపై దాడి చేయడం అమానుషం అన్నారు. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల్లో కులాల మధ్య చిచ్చు పెడుతూ, దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాంటి వ్యక్తుల నుంచి నాయకులను, ప్రజలను కాపాడేందుకు తానున్నానని భరోసా కల్పించి వారిలో ధైర్యాన్ని నింపారు. అనంతరం ఆయన గ్రామ ప్రజలతో పాదయాత్రగా స్థానిక పోలీస్ స్టేషన్ వరకు వెళ్లి ఎస్సై కట్టా అనూక్‌ను కలిశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకులు, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్‌లు, సచివాలయ కన్వీనర్‌లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శాశ్వత అన్నదానానికి విరాళం



ఆశ్రమ కన్వీనర్‌కు నగదు అందిస్తున్న దాత

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ పరిధిలోని నీలకంఠాపురంలో గల అనాథ వృద్ధ శరణాలయానికి పందిళ్లపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కోనంకి పరబ్రహ్మం రూ.20 వేలు విరాళాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ శాశ్వత కన్వీనర్ సత్రం మల్లేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ మార్పు గ్రెగోరి, గుత్తి విశ్వేశ్వరరావు, మార్పు శాంసన్, చల్ల వాసు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్య పుస్తకాలు

బల్లికురవ: ప్రభుత్వం పాఠశాలలు తెరిచే సమయానికే పాఠ్యపుస్తకాలు అందించాలన్న సంకల్పంతో శనివారం సాయంత్రం ఎమ్మార్సీ కార్యాలయానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి పాఠ్య పుస్తకాలను చేర్చినట్లు ఎంఈవో బీ. వీరరాఘవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో 1 నుంచి 10 వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిషు మీడియాల్లో చదువుతున్న విద్యార్థులకు 35 వేల పాఠ్య పుస్తకాలు అవసరం కాగా తొలి విడతగా 22 వేల వరకు అందజేసినట్లు చెప్పారు. ఈ మాసాంతంలోపు అన్ని పాఠశాలకు పుస్తకాలను హెచ్‌ఎంలకు అందజేస్తామని ఎంఈవో వివరించారు.

గర్భిణులకు ఐరన్ టానిక్‌లు పంపిణీ

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో పట్టణంలోని వైకుంఠపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఐరన్ టానిక్‌లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాబూరావు 15 మంది గర్భిణులకు ఐరన్ టానిక్‌లు, క్యాల్షియం టాబ్లెట్లు అందించారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, శారీరక శ్రమ, వైద్యుడి సలహా మేరకు తీసుకోవాల్సిన మందులు గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శంకరరెడ్డి, డాక్టర్ జ్యోతిరావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

చీరాల అర్బన్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం జూన్ 11వ తేదీ వరకు నిర్విరామంగా నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ డి.ధనమ్మ తెలిపారు. శనివారం గ్రంథాలయంలో చిన్నగంజాంకు చెందిన హైస్కూల్ ఉపాధ్యాయులు డి.హేమంత్‌కుమార్ విద్య వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. పిల్లలలో ఉత్సాహాన్ని నింపే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ తెలిపారు. అనంతరం మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. పట్టణంలోని అన్ని పాఠశాలల విద్యార్థులను క్రమం తప్పకుండా గ్రంథాలయానికి పంపాలని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులు ఆమె కోరారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశ భవిష్యత్

చీరాల రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే దేశ భవిష్యత్ ముడిపడి ఉందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దేవరపల్లి రంగారావు అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నందున శనివారం చీరాలలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టి బాణా సంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని ఎన్నికల ఫలితాలు బీజేపీకి అక్కడి ప్రజలు కనువిప్పు కలిగించారని చెప్పారు.

వైభవంగా రామలింగేశ్వరుడి తిరునాళ్ల



అలంకరణలో రామలింగేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ

● భారీ ఎలక్ట్రిక్ ప్రభలతో సాంస్కృతిక కార్యక్రమాలు

బల్లికురవ: మండలంలోని కొనిదెన గ్రామ సమీపంలో వేంచేసి ఉన్న రామలింగేశ్వరస్వామి 14 వార్షిక తిరునాళ్ల శనివారం కన్నుల పండువగా జరిగింది. అర్చకుడు గూడూరు మోహన్‌శర్మ బృందంచే ఉదయం 5 గంటలకే రామలింగేశ్వరుడికి మహన్యాస ఏకవార రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను వేదికపై చేర్చి వేదమంత్రోచ్ఛరణల మధ్య శివకల్యాణం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

వేడుకల్లో భాగంగా వైఎస్సార్ సీపీ, టీడీపీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు భారీ ఎలక్ట్రిక్ ప్రభలను ఏర్పాటు చేశారు. ప్రభలపై జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. బల్లికురవ ఎస్సై వీ. వేమన, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

లోక్ అదాలత్‌లో సత్వరమే న్యాయ పరిష్కారం



చీరాల: సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ



అద్దంకి: లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి

చీరాల రూరల్: కేసులను రాజీ చేసుకునేందుకు లోక్ అదాలత్‌ను ఆశ్రయిస్తే సత్వరమే న్యాయ సహాయం దొరుకుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధ పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకుని శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహాన మాట్లాడుతూ మూడు లక్షలులోపు గలవారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని చెప్పారు.

614 కేసులు పరిష్కారం..

లోక్ అదాలత్‌లో 614 కేసులు పరిష్కరించారు. వాటిలో క్రిమినల్ కేసులు 104, ప్రీ లిటిగేషన్ కేసులు 24, డీవీసీ కేసు 1, భరణం కేసు 1, ఐపి కేసు 1, సివిల్ కేసు 6 ,మనీ మ్యాటర్ కేసు 1, అడ్మిషన్స్ 56, ఎస్టీసీ కేసులు 427 కేసులు పరిష్కారమయ్యాయి. మొదటి బెంచ్‌కు ప్రిసైడింగ్ అధికారిగా సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ వ్యవహరించగా మెంబర్లుగా న్యాయవాదులు యానిగ్రేస్, ఏవీ సుబ్బారెడ్డిలు వ్యవహరించారు. రెండో బెంచ్‌కు ప్రిసైడింగ్ అధికారిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహాన వ్యవహరించారు. మెంబర్లుగా న్యాయవాదులు శ్రీకాంత్ ఠాకూర్, కోటేశ్వరిలు వ్యవహరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రమేష్‌బాబు, న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: అద్దంకి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 545 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి బీ. బాబునాయక్ తెలిపారు. వీటిలో సివిల్ కేసులు 19, క్రిమినల్ 79, చెక్‌బౌన్స్ కేసులు 04, మనోవర్తి కేసు 1, పెట్టి కేసులు 442 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఎం. బుజ్జప్ప, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం. సింగయ్య, లోక్ అదాలత్ సభ్యులు ఎస్ నాగేశ్వరరావు, హయగ్రీవాచారి న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహా మండప నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దాతలు, భక్తులు

వేటపాలెం: స్థానిక నాయినపల్లిలో వేంచేసి యున్న గంగా పార్వతీ సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయం ముందు నూతనంగా నిర్మించనున్న మహా మండపం నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఆలయంలో ప్రధాన అర్చకుడు కారంచేటి చంద్రశేఖరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు మాట్లాడుతూ 10వ శతాబ్దంలో చోళ రాజులచే నిర్మితమైన అతిపురాతనమైన శివాలయంగా పేరొందిందన్నారు. ఈ శివాలయం ముందు భాగంలో దాతల సహకారంతో మహా మండపం నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండప నిర్మాణ దాతలు, భక్తులు పాల్గొన్నారు.

శాంతియుత ప్రయోజనాలకే అణుశక్తి



అణుశక్తిపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

చీరాల టౌన్: అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్‌గౌతమ్ అన్నారు. వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలోని ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో శనివారం 1998 మే 11 నుంచి 13 వరకు జరిగిన అణుశక్తి పరీక్షలపై పోఖ్రాన్–2 అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి అణుశక్తి గురించి, శాంతియుతంగా అణుశక్తిని ఎప్పుడు ఉపయోగించాలో వివరించారు. అణుశక్తి వలన కలిగే ప్రయోజనాలను గురించి ఎన్‌సీసీ క్యాడెట్లు ప్లకార్డులతో నిర్వహించిన ర్యాలీని టూటౌన్ ఎస్సై చంద్రావతి ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు, సుబేదార్ లక్ష్మణ్‌సింగ్, హవల్దార్ సింగ్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



శింగరకొండలో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



చీరాల: చందన అలంకారంలో దర్శనమిస్తున్న వీరాంజనేయస్వామి

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా రెండో రోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా మూలవిరాట్‌కు మహన్యాస పూర్వక ఏకాదశ మన్యుసూక్త వారాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి సుభద్ర, ఉభయదాతలు బల్లికురవ మండలం కొండాయపాలెం గ్రామానికి చెందిన ధూళిపాళ్ల రామగోవిందు దంపతులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: హనుమజ్జయంతి ఉత్సవాలను పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని బోస్‌నగర్‌లో గల వీరాంజనేయస్వామి దేవాలయంలో ఉత్సవాల్లో భాగంగా శనివారం వీరాంజనేయస్వామికి చందనంతో అలంకరించారు. సాయంత్రం 4.30 గంటలకు దేవస్థానం నుంచి హనుమాన్ శోభాయాత్ర దేవదాయ శాఖ మేనేజర్ జీవీఎల్ కుమార్ తెలిపారు.

రైతుల పేర్ల నమోదుకు గడువు పొడిగింపు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

జే.పంగులూరు: మొక్కజొన్న రైతుల పేర్లు నమోదు గడువు ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం జాగర్లమూడివారిపాలెంలో మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. మొక్క జొన్న పంటకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ. 1962 ధర చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాల్సిన వారు స్థానిక ఆర్బీకేలో రైతులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని తెలిపారు. కొత్తగా పొలం పాస్ పుస్తకాలు పొందిన వారు, ఇప్పటి వరకు రైతు భరోసా పొందని భూ యజమానులు ఈనెల 18 లోపు ఆర్బీకేలో నమోదు చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్ ఈ కేవైసీ చేయించుకొని రైతులు మీ సేవ కేంద్రంలో గాని, రైతు భరోసా సిబ్బందిని గాని సంప్రదించి ఈ కేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు.

ప్రయాణాల్లో జాగ్రత్తలు చాలా ముఖ్యం



చినగంజాంలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేష్



వాహనదారులకు అవగాహన కలిగిస్తున్న ఎస్సై నాయబ్ రసూల్

చినగంజాం: మద్యం తాగి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదంకరం అని చినగంజాం ఎస్సై కే సురేష్ అన్నారు. నో యాక్సిడెంట్ డేను పురస్కరించుకొని శనివారం ఆయన చినగంజాంలోని జాతీయ రహదారిపై వాహన దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 20 మంది వాహనదారుల నుంచి ఈ–చలానా రూపంలో నగదు వసూలు చేశారు.

ఇంకొల్లులో..

రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు భద్రత చాలా అవసరం అని ఇంకొల్లు ఎస్సై ఎస్కే నాయబ్ రసూల్ అన్నారు. నో యాక్సిడెంట్ డే పురస్కరించుకొని ఆయన శనివారం వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనం అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

బల్లికురవ: వైఎస్సార్ రైతు భరోసా గతంలో వర్తించని అర్హులు ఈ నెల 18వతేదీ లోపు ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారిణి ఎస్వీపీ కుమారి శనివారం తెలిపారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం మేలో తొలివిడత పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు చెప్పారు. సాయం అందని అర్హులరైతుల జాబితాలను సచివాలయాలు, ఆర్‌బీకేలో జాబితాలో ఉంచామని తెలిపారు. రైతులు వీఏఏల ద్వారా వివరాలతో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఆకట్టుకున్న నాటికలు

చీరాల అర్బన్: మున్సిపల్ గరల్స్ హైస్కూల్ ఆవరణలో చీరాల కళాంజలి ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి చైతన్యభారతి, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో 'చీకటి పువ్వు' నాటికను ప్రదర్శించారు. అలానే అమృత లహరి థియేటర్ ఆర్ట్స్, గుంటూరు వారి ఆధ్వర్యంలో 'నాన్నా.. నేనొచ్చేస్తా' అనే నాటికను ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలకు అభిమానులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. ప్రదర్శిస్తున్న నాటికలు ఆహుతులను ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమంలో కళాంజలి అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, తిరుమలశెట్టి సాంబశివరావు, వలివేటి మురళీకృష్ణ, బీరం సుందరరావు, బత్తుల బ్రహ్మారెడ్డి, కోశాధికారి దరియా సాహెబ్, పూర్ణా సత్యం, వడలి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

చినగంజాం: ఇంకొల్లు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ఇంకొల్లులోని ప్రధాన కూడలిలో ప్రారంభించారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు మాదాల బాల శ్రీనివాసరావు సహకారంతో మజ్జిగతో పాటు మంచి నీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ దోగిపర్తి అయ్యప్పస్వామి, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ చిన్ని పూర్ణారావు, సెక్రటరీ దోగిపర్తి బదరీ నారాయణ, ట్రెజరర్ బైశాని నరసింహశెట్టి, మాజేటి రామకృష్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కిమ్స్ వైద్యులు

జే.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం నందు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 150 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరం నందు బీపి షుగర్, ఈసీజీ, పరీక్షలు నిర్వహించి ఒక వారం పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాళ్లూరి రామాంజినేయులు, పి కాలేషావలి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.